

# మూడు వరాలు

పాలకూర సీతాలత

సతీసావిత్రి మహా పతివ్రత ఆమె భర్త సత్యవంతుడు. ఒకనాడు అడవిలో కట్టెలు కొట్టడానికి వెళ్ళినప్పుడు పాము కరవడంవల్ల అతను మరణిస్తాడు. సావిత్రి తన భర్త శవం మీద పడి ఏడుస్తూ వుంటుంది. సత్యవంతుడిమీద "పాశం" విసిరి తీసుకుపోవడానికి యముడు "రెడీ" అవుతాడు యమధర్మరాజు ఎవ్వరికీ కనిపించడు. కానీ సావిత్రి మహాపతివ్రత కనుక ఆమెకు కనిపిస్తాడు. తన భర్త ప్రాణాలు ఇయ్యమని కోరుతుంది సావిత్రి అది సాధ్యం కాదంటాడు యముడు. సత్యవంతుడిని యముడు తీసుకుపోతుంటే యముడి వెనకాల నడుస్తుంది సావిత్రి. అతి క్లిష్టమైన దారిలో ఆమె ప్రయాణం చేస్తుంది. ఆమె ఎంతకూ విడిచిపెట్టకుండా వుండటంతో ఆశ్చర్యపోయిన యముడు-

"సావిత్రీ! నీ భర్త ప్రాణాలు తప్ప ఏదైనా వరం కోరుకో..." అంటాడు.

"రాజ్యభ్రష్టులై, కారడవిలో పడి వున్న మా అత్తమామలకు రాజ్యప్రాప్తితోపాటు, అంధులయిన వారికి నేత్ర దృష్టి ప్రసాదించు..." అంటుంది.

"అలాగే..." అంటూ ఆ వరం ఇస్తాడు యముడు.

అయినా ఆమె తిరిగి వెళ్ళకుండా ఆ యముడిని అనుసరిస్తుంది. ఆమె ఓపిక మెచ్చుకుని-

"మరొక్క వరం కోరుకో...నీ భర్త ప్రాణం తప్ప..." అంటాడు యముడు.

"పుత్రులు లేరని బాధపడుతున్న

నా తల్లిదండ్రులకు మగసంతానం ప్రసాదించు" అంటుంది.

"సరే!" అంటూ ఆ వరంకూడా ఇస్తాడు

అయినా పట్టువదలక యముడివెంట వెళుతూవుంటుంది.

"ముచ్చటగా మూడో వరం ఇయ్యవా!" అని అడుగుతుంది

"పోన్లే! ఆఖరివరం కదా! నీ భర్త ప్రాణాలు తప్ప ఏమయినా కోరుకో" అన్నాడు యముడు. ఈ దెబ్బతో సావిత్రి గొడవ వదిలిపోతుందని ఆనందిస్తూ.

"సంతానం చూసి సంతోషించే వరం ఇయ్యి" అంటుంది.

"అలాగే ఇచ్చాను" అంటాడు.

"మానవ లోకంలో పతివ్రతలు భర్త లేకుండా సంతానం పొందలేరు కనుక, నా భర్తను బ్రతికించి ఇయ్యి అప్పుడే ఈ వరం తీరినట్లు" అంటుంది సావిత్రి 'లా' పాయింటు లాగుతూ.

యమధర్మరాజు ఇక చెయ్యగలిగేది ఏమీ లేక, తన ఓటమి అంగీకరించి, సత్యవంతుడిని బ్రతికించి సావిత్రికి అప్పగించి యమలోకం వెళ్ళిపోతాడు. సావిత్రి తన భర్తతో ఇంటికివెళుతుంధి.

○ ○ ○ ○

"ఈ కథ మాకు తెలుసు. ఇదేనా నువ్వు చెప్పదలుచుకున్నది?" కోపంగా అడిగేడు మారుతీరావు గోవర్ధనంని.

"అలా ఆవేశపడకు. నేను చెప్ప దల్చుకున్న మా మామయ్యకథకీ, ఈసతీ సావిత్రి కధకి చాలా పోలికలున్నాయి. కనుక ఉపోద్ఘాతంగా ఆకథ చెప్పాను. అసలు కథ ఇప్పుడు చెప్తాను......"

అన్నాడు గోవర్ధనం.

"అయితే ఈకధలో మీ మామయ్య యముడా? యముడిని బోల్తా కొట్టించిన సతీ సావిత్రా?"

మామయ్య సతీ సావిత్రి. యముడు మానాన్న..."

"అయితే చెప్పు..."

"విను మరి..."

○ ○ ○

సంగమేశ్వరరావుగారు ఒక ప్రభుత్వ సంస్థలో పెద్ద ఆఫీసరు. ఆ సంస్థ గంగిగోవులాంటిది. జీతంకన్నా గీతం ఎక్కువ దొరికే చోటు అది. కనుక సంగమేశ్వర రావుకూడా మడికట్టుకుని కూర్చోకుండా రెండో చేత్తోకూడా ఆర్జించటం మొదలు పెట్టాడు. ఆర్జిస్తున్నాడు కానీ వెనక వేసు కోవటంలేదు. అందుకు కారణం హోదాకు మించి అతి దర్జాగా బ్రతికెయ్యడం, కొన్ని దురలవాట్లకు లోనుకావడం. ఆయనకు ఒక కొడుకు, ఒక కూతురు. ఇద్దరూ కూడా కాలేజీ చదువు వెలగబెడుతున్న వాళ్ళే.

ఆయన చెల్లెలు భర్త పరమహంస ఎం. ఎల్. ఏ. కనుక కొద్దో, గొప్పో, పలుకుబడి ఉంది. తన లంచగొండితనం ఎంతగా ముదిరినా ఫరవాలేదనీ, పరమ హంస తన ఉద్యోగానికి అడ్డువేసి రక్షించగలరనీ గొప్పనమ్మకం సంగమేశ్వర రావుకి. కనుకనే ముందూ వెనుకా చూడకుండా ఇష్టం వచ్చిన రీతిలో లంచాలు మెయ్యడం మొదలు పెట్టాడు.

"మీ అన్నయ్యను కొంచెం అదుపులో వుండమని చెప్పు. ఆయన మీద చాలా కంప్లయింట్స్ వస్తున్నాయి. ఆయన గురించి కాకపోయినా నా పలుకుబడి

సర్దుకుని వస్తున్నాను" అన్నాడు పరమ హంస భార్యతో.

"వాడు వినేట్లులేడు. గడ్డితినడం అల వాటైపోయాకా అది మానుకోవడం చాలా కష్టంగా ఉంటోందట. అయినా ఇంకొకసారి చెప్తాను..." అంది ఇల్లాలు భర్తతో.

సంగమేశ్వరరావు ఎవర్నీ లెక్క చెయ్యటంలేదు. ఏపనిమీద ఎవరువచ్చినా, కూర్చోమనిఅనకుండాకూడా బేరాలు ఆడే స్తున్నాడు. ఆయన కొడుకు పరమశివం.

"నాన్నా! ప్రమాదం..."అన్నాడు.

ఆయన కూతురు మంజుల

"నాన్నా! డేంజర్..." అంది.

ఆయన భార్య

"జాగ్రత్తండీ..." అంది.

నిర్లక్ష్యంగా తల ఎగరేశాడు. ఏమీ కాదన్నట్లు చూశాడు.

"దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దు కోవాలి..." అన్నాడు.

"కానీ మీరు ఇల్లు చక్క పెట్టడం లేదు..." అంది భార్య.

"అని ఎలా అనుకున్నావు? పిల్ల లిద్దరూ కూడా ఇంకాచదువుకుంటున్నారు. లేకపోతే అబ్బాయిని మంచి ఉద్యోగంలో ప్రవేశపెట్టేవాడిని. అమ్మాయికి రాజా లాంటి సంబంధం చూసేవాడిని...."

మాట్లాడలేదు భార్య.

"ఆ రెండు పనులు చేస్తాను చూడు. నువ్వు బెంగపడకు...అంటూ లేచి వెళ్ళి పోయాడు అక్కడ్నించి.

నిట్టూర్చింది భార్య.

సిగరెట్ అంటించేడు సంగమేశ్వర రావు.

శవాల్ని పీక్కుతినే గద్దకు కూడా సంగమేశ్వరరావు పై ఆఫీసరు కొత్తగా వచ్చినవాడు. ఇతని అవినీతిని గురించి విని, ప్రత్యక్షంగా చూసి, కత్తి కట్టి, సాక్ష్యంతోసహా రిపోర్టు చేసి సస్పెండ్ చేయించాడు. ఆ ఆఫీసర్కి మినిష్టర్ లెవెల్లో హోల్డ్ ఉండటంవల్ల పరమహంస కూడా ఏమీ చెయ్యలేక పోయాడు. మరొక నెలరోజులు అయ్యే సరికి డిస్మిస్అయి ఇంట్లో కూర్చున్నాడు సంగమేశ్వరరావు.

మళ్ళీ జరిగిన ఎన్నికలలో పరమ హంస ఎం. ఎల్. ఏ.గా గెలిచాడు. అంతేకాదు, ఒక శాఖకు మంత్రి కూడా అయ్యాడు. అలా మంత్రి పదవి తనను వరిస్తుందని పరమహంసకు కూడా తెలీదు. కొత్తవారికి మంత్రి పదవి ఇయ్యాలన్న ప్రతిపాదనలో అతనిపేరు కూడా ఆ లిస్టులో చేరింది.

పరమహంస మంత్రి అయ్యాకా సంగమేశ్వర్రావు హైద్రాబాదు ప్రయాణం కట్టాడు పరమహంసను కలుసు కున్నాడు.

o o o

"ఏమిటిబావా, విశేషాలు?"అన్నాడు పరమహంస.

"ఏముంది? విధి వక్రించడంతో? రారాజుగా బ్రతికిన నేను అజ్ఞాతవాసం చేస్తున్నాను." నిరాశగా అన్నాడు సంగ మేశ్వరరావు.

"నీకు ముందే హెచ్చరించాను. కాని నువ్వు వింటేగా?"

"గతం గతః...ఇప్పటి సంగతి చెప్పు..."

"ఏం చెప్పను."

"నువ్వు మంత్రివి. నా ఉద్యోగం నాకు ఇప్పించాలి మరి..."

"అదెలా కుదురుతుంది? చాలా కష్టం. కష్టం ఏమిటి అసాధ్యం"

'నువ్వుతలుచుకుంటేకానిదేముంటుంది'

ఆ సంగతి వదిలెయ్యి. బంధుప్రీతితో నేను రూల్స్‌కి వ్యతిరేకంగా వెళ్ళితే, రేపు నా గతి ఏమిటి?"

"అందే నా గురించి నీకు ఏమీ పట్టదన్నమాట"

"అలా అనికాదు, నువ్వు ఏం అడిగినా చేస్తాను, నీ ఉద్యోగం గురించి తప్ప"

"అయితే నాకొక వరం ఇస్తావన్నమాట"

"అవును, నీ ఉద్యోగం తప్ప"

" మా మంజుల చదువులో వుంది కదా అని చెప్పి ఇన్నాళ్ళూ దాని పెళ్ళి విషయం వాయిదా వేస్తూ వచ్చాను. దాని చదువు పూర్తి కావడం, నా ఉద్యోగం పోవడం ఒకేసారి జరిగాయి. ఇప్పుడు పెద్ద కట్నంపోసి దాని పెళ్ళి చెయ్యడం నాకు సాధ్యమా? దాని పెళ్ళి సమస్య."

"అర్థం అయ్యింది. దాని పెళ్ళి నీకు సమస్య కాకుండా చూస్తాను. సరేనా?"

"ఎలా?"

"ఏముంది? నా కొడుకు గోవర్ధనంకి దాన్నిఇచ్చి పెళ్ళి చేస్తాను. కానీ కట్నం అక్కర్లేదునాకు. నా మాట మా వాడు కాదని కూడా అనడు. మీ అమ్మాయి ఏమంటుందో చూడు..."

"ధన్యోస్మి దానికి అభ్యంతరం ఏంవుంటుంది? గోవర్ధనం అంటే దానికి ఇష్టమే అన్న విషయం నేను గ్రహించాను. నా సమస్య తీర్చావు చాలా సంతోషం"

పరమహంస తృప్తిగా తల ఆడించాడు

"కూతురు సమస్య తీరిందని సంతోషంగా వుంది కానీ ఇంతమాత్రాన్న నాకున్న సమస్యలన్నీ తొలగిపోయినట్లాయేం? అసలే ఉద్యోగం పోయిందన్న బాధతో వాడి సమస్య కూడా వచ్చి మరింత కృంగిపోతున్నాను" అన్నాడు సంగమేశ్వరరావు.

"ఇంకేం సమస్య?"

" నా కొడుకు పరమశివం"

"ఏమైందివాడికి?"

"ఏం కాలేదని అడుగు. నేను ఉద్యోగంలో వుండివుంటే వాడిని ఏదో ఒక మంచి ఆఫీసరుగా జాయిన్‌చేసివుందును. అప్పట్లో చదువు పూర్తికాలేదనిఆగాను. ఆఫీసరు తన కొడుకుకూడా ఆఫీసరే కావాలని ఆశిస్తాడు. నా ఆశ తిరకపోతే ఇకనేను బ్రతికి ఏం లాభం? రేపట్నుంచి ఇల్లు గడిచేది ఎలా? వాడిక్కూడా ఒక మంచి ఉద్యోగం వచ్చివుంటే నేను ఏ మాత్రం బాధపడేవాడిని కాను ఈరోజు నీ దగ్గరకు ఇలా జోలెపట్టి వచ్చేవాడిని కాను..."

"అర్థం అయ్యింది నీకు ఆసమస్య కూడా తీరుస్తాను..."



"పెళ్ళిలో పెళ్ళికూతురు చేయి ఎందుకు పట్టుకుంటాడు పెళ్ళికొడుకు?"

"ఆత్మరక్షణకోసం!"




"అంటే, రెండో వరం ఇస్తావన్న మాట..."

"అవును....అదికూడా నీ ఉద్యోగం విషయం తప్ప..."

"ఏం చేస్తావు?"

"ఏముంది? వాడికొక మంచి ఉద్యోగం ఇప్పిస్తాను. ఆఫీసరుగా వాడికి పోస్టింగ్ ఆర్డర్స్ ఇప్పిస్తాను..."

"చాలు బావా చాలు...నాకు చాలా పెద్ద ఉపకారం చేశావు..."

"ఇంకేమీ సమస్యలు లేవు నీకు వెళ్ళిరా..." అన్నాడు పరమహంస.

"రెండు వరాలు ఇచ్చావు. ముచ్చటగా మూడోవరంకూడా ఇయ్యి...." బ్రతిమాలేడు సంగమేశ్వరరావు.

"పోనీలే...ఆఖరివరం అని అడుగుతున్నాడు. ఇచ్చేస్తేసరి..." అనుకున్నారు పరమహంస.

"సరే బావా!...ఆఖరి వరంకోరుకో అదికూడా నీ ఉద్యోగం గురించి తప్ప"

"అలాగే...నా పాత పార్టీలంతా గతంలోలాగే నన్ను గౌరవిస్తూ, గతంలో జరుపుతున్న లావాదేవీలు మళ్ళీజరిపేలా అనుగ్రహించు..." అన్నాడు సంగమేశ్వరరావు.

"సరే...అలాగే కానీ..." అన్నాడు పరమహంస వెంటనే.

"అయితే నాకు మళ్ళీ ఉద్యోగం ఇప్పిస్తున్నదే మరి..." అన్నాడు ఆనందంగా సంగమేశ్వరరావు.

"ఎలా?" ఆశ్చర్యంగా అన్నాడు పరమహంస.

"వాళ్ళంతా నన్ను గతంలోలాగ ఎప్పుడు గౌరవిస్తారు? నేను ఆ పదవిలో ఉన్నప్పుడు. గతంలోలాగ లంచాలు ఎప్పుడు ఇస్తారు? నేను ఆ పదవిలో ఉన్నప్పుడు, కనుక నీ ఆఖరి వరం నెరవేరాలంటే నాకు ఆ ఉద్యోగం తిరిగి ఇప్పించాలి...అంతేకదా!..."అన్నాడు సంగమేశ్వరరావు లా పాయింట్ లాగుతూ.

"నీ వాక్చాతుర్యానికి సంతోషిస్తున్నాను. అడినమాట తప్పను. రూల్సుకి వ్యతిరేకం అయినా, నీ మీద అవినీతి

నిరూపణలన్నీ, అసత్యాలని రుజువుచేసి నీకు మళ్ళీ ఆ ఉద్యోగం ఇప్పిస్తాను. తప్పుతుందా?'' అన్నాడు పరమహంస.

"సంతోషం..." అన్నాడు సంగమేశ్వరరావు ఆనందంతో పొంగిపోతూ.

"నీ మొదటి రెండు వరాలు కూడా" సణిగాడు సంగమేశ్వరరావు.

"అలాగే తప్పకుండా. దాని గురించి నువ్వు బెంగ పెట్టుకోకు..." అన్నాడు అభయహస్తం ఇస్తూ పరమహంస.

"నా బెంగ తీరిపోయింది. నిజంగా నువ్వు గొప్పవాడివి. నమ్మిన వాళ్ళను కాపాడే మంచి గుణం ఉన్నవాడివి. నువ్వు నా బంధువర్గంలో కావడం నేను ఏ జన్మలోనో చేసుకున్న అదృష్టం."

సన్నగా నవ్వాడు పరమహంస.

ఆనందంగా సిగరెట్ వెలిగించాడు సంగమేశ్వరరావు.

అతనిలో ఆనందం వర్ణించనలవిగాకుంది గత వైభవం తిరిగి వరించబోతోందన్న తలపు అతన్ని నిలవనియ్యటం లేదు.

○ ○ ○

"అదిరా మామయ్య కథ..." పూర్తి చేశాడు గోవర్ధనం.

"తర్వాత ఏమైంది?" అడిగేడు మారుతీరావు, కథంతా ఆసక్తిగా విని.

"అవ్వడానికి ఏముంది? మంజుల నా భార్య అయ్యింది. పరమశివం ఆఫీసరయ్యాడు. మామయ్యకు మళ్ళీ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంపోయిందన్న కసి బాగా పెంచుకుని ఉన్నాడేమో, ఇదివరకు కంటె ఎక్కువగా లంచాలు మేస్తున్నాడు అంతే..."

"ఆహా! అయితే మీ మామయ్య దేవాంతకుడన్నమాట..." అన్నాడు మారుతీరావు.

ఇంతలో లోపల్నుంచి మంజులవచ్చి రెండు కప్పులతో కాఫీలు తెచ్చింది. భార్యను పరిచయం చేసాడు గోవర్ధనం మిత్రుడికి.

"మీ అన్నయ్య పరమశివంకి వీళ్ళ చెల్లెల్ని ఇయ్యాలన్న ఉద్దేశంతోవచ్చాడు. మీ కుటుంబం గురించి వివరాలు అడిగేడు మీనాన్న గురించి ఒక కథ చెప్పాను. అటువంటి తెలివైన కుటుంబంలో పిల్లనిస్తే బాగుంటుందన్న ఉద్దేశం వ్యక్తం చేయడానికే ఈ కథ చెప్పాను అంతే" అన్నాడు మంజులతో కొంచెం ఎపాలజీగా.

"అవునండీ...కొంచెం ఉత్తరంరాసి మీ వాళ్ళకు ఎప్పుడు వీలుంటుందో కనుక్కోండి పిల్లనుచూసుకునేందుకురమ్మని రాస్తాను..." అన్నాడు మారుతీరావు మంజులతో!

"అలాగే..." అంటూ లోపలకు వెళ్ళిపోయింది మంజుల!

ఆరాత్రి భర్తతో పోట్లాడేసుకుంది మంజుల!

"ఇలా అందరికీ మా కుటుంబం గురించి కథచెప్పడానికి వీల్లేదు! అంతే" అంది!

"అలాగే!..." అంటూ చెంపలు వేసుకుని దగ్గరకు తీసుకున్నాడు మంజులను గోవర్ధనం!

